శెనార్తి మీడియా
మన యాసే.. మన బలం

GENERAL NEWS

గురువారం
20-03-2025
SHENARTHI MEDIA

## సిబ్బంది సంక్షేమానికి "పోలీస్ దర్బార్"

- రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝూ



**శెనార్తి మీడియా, మంచిర్యాల/ గోదావరిఖని**

రామగుండం కమిషనరేట్‌లో మంగళవారం పోలీస్ సిబ్బందితో పోలీస్ దర్బార్ నిర్వహించారు. కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏఆర్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ... సిబ్బంది సమస్యలను వ్యక్తిగతంగా తెలుసుకుని తక్షణ పరిష్కారం కల్పించేందుకు దర్బార్ నిర్వహించినట్లు తెలిపారు. ఎవరికి ఎలాంటి సమస్య ఉన్నా సంకోచం లేకుండా చెప్పాలని, అవసరమైతే కార్యాలయానికి వచ్చి నేరుగా కలిసి వివరించవచ్చని సూచించారు. పోలీస్ విధుల్లో క్రమశిక్షణతో పాటు సమన్వయం అవసరమని, సిబ్బంది ప్రవర్తనపై శాఖ ప్రతిష్ఠ ఆధారపడుతుందని గుర్తుచేశారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని, క్రీడల్లో పాల్గొని మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలని సూచించారు. సిబ్బందికి, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి రెండు నెలలకు ఒకసారి మెడికల్ క్యాంప్ నిర్వహిస్తామని తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ సీ. రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఆర్ఐలు దామోదర్, వామన మూర్తి, సంపత్, ఆర్ఎస్ఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లాలి



**శెనార్తి మీడియా, చిగురుమామిడి**

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు వెళ్లాలని హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి పిలుపునిచ్చారు.కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరి ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు బుధవారం పీఆర్పీ న్యూస్ యూట్యూబ్ ఛానల్ వారి ఆధ్వర్యంలో 30మంది విద్యార్థులకు పరీక్షా సామాగ్రిని మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా తిరుపతి రెడ్డి మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని అందజేసి ప్రోత్సహించిన పిఆర్పీ న్యూస్ యూట్యూబ్ ఛానల్ వారికి విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ పావని,తాజామాజీ సర్పంచ్ శ్రీమూర్తి రమేష్,మన తెలంగాణ రిపోర్టర్ పత్తెం శ్రీనివాస్,పీఆర్పీ న్యూస్ ఛానల్ సీఈఓ పత్తెం రమేష్,మనం రిపోర్టర్ శేషం నరసింహచార్యులు,సూర్య రిపోర్టర్ జేరుపోతుల సదానందం, తెలంగాణ పత్రిక రిపోర్టర్ ఎనగందుల అశోక్,పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## 21 లోగా ఖాతా వివరాలు అందజేయాలి

**శెనార్తి మీడియా, మంచిర్యాల**

కేంద్ర ప్రభుత్వం వెనుకబడిన తరగతుల విద్యార్థులకు అందించే ఫీజు రియంబర్స్మెంట్లో జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు తమ వాటాను పొందేందుకు తమ బ్యాంక్ ఖాతా వివరాలు, పాస్బుక్ పత్రులను ఈ నెల 21వ తేదీ లోగా జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ కార్యాలయంలో అందించి ఆన్లైన్లో పొందుపర్చుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎ.పురుషోత్తం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి కళాశాల తమ లెటర్హెడ్పై ఖాతా వివరాలతో పాటు స్టేట్మెంట్ ప్రతిని జత పరిచి అందించాలని తెలిపారు.

## సంక్షేమ బడ్జెట్ ఇది : ఎమ్మెల్యే భోజ్జు పటేల్

**శెనార్తి మీడియా, ఉట్నూర్:** రాష్ట్ర ఆర్థిక మంత్రి, ఉప ముఖ్య మంత్రి మల్లు బట్టి విక్రమార్క బుధవారం అసెంబ్లీ లో ప్రవేశ పెట్టిన వార్షిక బడ్జెట్ రాష్ట్రంలో సబ్బండ వర్గాల ప్రజల అభివృద్ధికి బాటలు వేస్తుందని, అభివృద్ధి, సంక్షేమం, సూపరిపాలన ధ్యేయంగా రూపొందించిన సంక్షేమ బడ్జెట్ అని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్ పేర్కొన్నారు. బడ్జెట్ లో ప్రజా సంక్షేమం, అభివృద్ధికి పెద్ద పీట వేశారాని అయన అన్నారు. గిరిజన సంక్షేమానికి రూ. 17169 కోట్లు కేటాయించడం పట్ల అయన హర్షం వ్యక్తం చేసారు. ఎస్సి, ఎస్టీ, మైనారిటీ సంక్షేమనికి ఆశాజనకంగా నిధులు కేటాయించడం హర్షనీయమన్నారు.

## చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**శెనార్తి మీడియా, మంచిర్యాల**



జిల్లాలోని ప్రాజెక్టుల క్రింద చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేందుకు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. బుధవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో నిర్వహించిన సాగునీటి నిర్వహణ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఎల్లంపల్లి ప్రాజెక్టులో 11.4 టి.ఎం.సి. నీటి నిల్వ ఉన్నదని, కార్యచరణ ప్రకారం నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు. సుందిళ్ళ, అన్నారం, గూడెం ఎత్తిపోతల సహా ఇతర మధ్య, చిన్న ప్రాజెక్టుల నుంచి నీరు విడుదలకు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. జూన్ 15వ తేదీ వరకు త్రాగునీటి కోసం ముందస్తు చర్యలు చేపట్టాలని, రైతులకు నీటి అవసరం తక్కువగా ఉండే ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించాలని సూచించారు. కెనాల్లు, చెరువుల శుద్ధి పనులు చేపట్టాలని, సిర్సా ఎత్తిపోతల పథకం, అర్జునగుట్ట, కిష్టాపూర్ ప్రాజెక్టులపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు. ప్రజలకు నీటి కష్టాలు లేకుండా కార్యచరణ అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ

## విద్యార్థులు భయాలు విడిచిపెట్టి నిర్భయంగా పరీక్షలు రాయాలి



**శెనార్తి మీడియా, కరీంనగర్**

పదో తరగతి విద్యార్థులు ఎలాంటి భయాలకు లోనుకాకుండా, ఒత్తిడిని అధిగమించి ప్రశాంత వాతావరణం లో పరీక్షలు రాయాలని పెద్దపల్లి డీసీపీ పి. కరుణాకర్ సూచించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో "పోలీసులు - మీ కోసం" కార్యక్రమంలో భాగంగా, ఓదెల మండలం పోత్కపల్లి పోలీస్ అధ్వర్యంలో జెడ్పిహెచ్ఎస్ ఓదెల పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ కరుణాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని, విద్యార్థులకు పరీక్షలపై చక్కటి మార్గదర్శకాన్ని అందించారు. పరీక్షలకు సమయం దగ్గర పడే కొద్దీ విద్యార్థుల్లో ఆందోళన పెరుగుతుందని, భయం వదిలి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే విజయం వారి సొంతమవుతుందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు కృషి చేసి, మంచి మార్కులతో గ్రామానికి, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు ప్రోత్సాహం కల్పించేందుకు పరీక్ష ప్యాడ్లు, కంపాస్ బాక్స్, పెన్సిలను డీసీపీ కరుణాకర్, ఏసీపీ జి.కృష్ణ విద్యార్థులకు అందజేశారు. అనంతరం కనగర్తి, ఓదెల, పోత్కపల్లి మండలాలకు చెందిన యువతకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ జి.కృష్ణ, సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, పోత్కపల్లి ఎస్సై ధీకొండ రమేష్, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం ముగిసిన అనంతరం అధికారులు విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.

## గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేసి వెంటనే సాగునీరు అందించాలి

**శెనార్తి మీడియా, చిగురుమామిడి**



అడుగంటిన భూగర్భ జలాలతో సాగునీరు అందక వరి,మొక్కజొన్న పంటలు ఎండిపోతుండడంతో రైతులు విలవిలలాడుతున్నారని సిపిఐ పార్టీ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి,సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు,మాజీ జెడ్పిటిసి అందే స్వామిలు మండిపడ్డారు.కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని లంబాడిపల్లె,గాగిరెడ్డిపల్లే తదితర గ్రామాల్లో సాగునీరు అందక ఎండిన వరి,మొక్కజొన్న పంటలను బాధిత రైతులతో కలిసి సిపిఐ పార్టీ,రైతు సంఘం ఆధ్వర్యంలో పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడుగంటిన భూగర్భ జలాలతో చేతికి వచ్చే సమయంలో పంటలు ఎండిపోతున్నాయని గౌరవెల్లి నీటితో భూములు తడిసేది ఎప్పుడు అంటూ వారు ప్రశ్నించారు.ఎన్నో అప్పులు చేసి పంటలు వేసిన రైతన్నలకు చివరి దశలో పంటలను కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నాలు చేసిన ఫలితం లేదని మండిపడ్డారు.కుర్చీ వేసుకుని గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేస్తామని ప్రగ్డబాలు పలికిన కేసీఆర్,బిఆర్ఎస్ ప్రభుత్వం 10సంవత్సరాలు అధికారంలో ఉండి గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేయలేక పోయిందని ధ్వజమేత్తారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15నెలలు గడిచినప్పటికీ గౌరవెల్లి ప్రాజెక్టు పనులు ముందుకు సాగకపోవడం పట్ల వారు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.ప్రతి సంవత్సరం సాగునీరు అందక పంటలు చివరి దశలో ఎండుతుండడంతో రైతులు అప్పుల పాలై తీవ్ర మనోవేదన గురవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఐ ఉద్యమాల పోరాటాల ద్వారానే మంజూరైన గౌరవెల్లి ప్రాజెక్టు పనులు పూర్తి చేసేందుకు దశాబ్దాలు గడిచినా పూర్తి కాకపోవడం సిగ్గుచేటు అన్నారు. రైతు భరోసా రాక,రైతులకు రుణమాఫీ కాక రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.రాష్ట్ర రవాణా,బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే స్పందించి చిగురుమామిడి మండలంలో ఎండిపోయిన వరి,మొక్కజొన్న పంటలను వ్యవసాయ శాఖ అధికారులచే సర్వే చేసి వరి పంటకు 40వేలు,మొక్కజొన్న పంటకు 30వేల నష్టపరిహారం అందించాలని వారు డిమాండ్ చేశారు.ఇప్పటికైనా మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే గౌరవెల్లి ప్రాజెక్టు పనులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని వారు కోరారు.లంబాడిపల్లె గ్రామంలో చేతికొచ్చిన వరి పంట ఎండిపోవడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేసిన రైతు చందబోయిన బాలయ్యకు 5వేల రూపాయల చెక్కును సిపిఐ పార్టీ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి అందజేశారు.రైతులు అధైర్యపడొద్దని సిపిఐ పార్టీ అండగా ఉంటుందని వారు ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కాంతాల శ్రీనివాస్ రెడ్డి,నాయకులు ఎనగందుల రాజయ్య,గోలి బాపురెడ్డి,అందే చిన్నస్వామి, విలాసాగరం అంజయ్య,మంద ఎల్లయ్య, కయ్యం తిరుపతి,కయ్యం వీరన్న, బింగి స్వామి పాల్గొన్నారు.

## పాఠశాల సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జి



**శెనార్తి మీడియా, కరీంనగర్**

కరీంనగర్ పట్టణంలోని మనోవికాస్ మేధో వికలాంగుల పాఠశాల, వృత్తి విద్యా కేంద్రాన్ని సీనియర్ సివిల్ జడ్జ్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కే. వెంకటేష్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించి, అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలపై సూచనలు అందించారు. అనంతరం విద్యార్థులకు పండ్లు పంపిణీ చేసి, వారికి మానసిక ఊరటనిచ్చేలా మాటలు చెప్పారు. అదేవిధంగా, ఏవైనా న్యాయపరమైన సమస్యలు లేదా న్యాయ సేవల అవసరం ఉంటే, న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని పాఠశాల నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కే. వెంకటేష్తో పాటు పాఠశాల ఉపాధ్యాయురాలు పాల్గొన్నారు.

## బాల బాలికలకు అవగాహన సదస్సు



**శెనార్తి మీడియా, కరీంనగర్**

కరీంనగర్ పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీ కుమార్ వాడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ, ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బాల బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా కోఆర్డినేటర్ ఆవుల సంపత్ యాదవ్ మాట్లాడుతూ... యుక్త వయస్సులో పిల్లలు మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. చరవాణి వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలని, వ్యక్తిగత వివరాలను సోషల్ మీడియా ద్వారా పంచుకోవడం ప్రమాదకరమని హెచ్చరించారు. లైంగిక నేరాల నిరోధక చట్టం 2012, బాల్య వివాహాల చట్టం 2006పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ రాజేశ్వరి, చైల్డ్ హెల్ప్ లైన్ కేస్ వర్కర్ సాయికిరణ్, ప్రధానోపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాల వ్యాపారంపై కఠిన చర్యలు



**శెనార్తి మీడియా, మంచిర్యాల**

కన్నెపల్లి మండలంలో నకిలీ విత్తనాల విక్రయాన్ని తీవ్రంగా తప్పుబడుతూ, ఇలాంటి అక్రమ కార్యకలాపాల్లో పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ గంగారం హెచ్చరించారు. బుధవారం వెంకటాపూర్ గ్రామంలో పాత నేరస్తులు పున్నపురెడ్డి చందు, పుట్ట అశోక్‌ల ఇళ్లలో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ గంగారం మాట్లాడుతూ... నకిలీ విత్తనాల వాడకంతో భూమి సారవంతత తగ్గి, పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుందని రైతులను హెచ్చరించారు. గ్లైఫోసేట్ వంటి నకిలీ విత్తనాల వల్ల రైతులకు చర్మ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. నకిలీ విత్తనాల అమ్మకాన్ని అరికట్టేందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై తీవ్రంగా వ్యవహరించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


## మద్యం మత్తులో గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

**శెనార్తి మీడియా, మంచిర్యాల**

మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం చిత్తాపూర్ గ్రామానికి చెందిన మగ్గిడి రాజ్ కుమార్ (35) మద్యం మత్తులో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజ్ కుమార్ నిత్యం మద్యం సేవించి భార్య లావణ్యతో తరచూ గొడవ పడేవాడు. ఈ నెల 14న జరిగిన గొడవ అనంతరం లావణ్య పుట్టింటికి వెళ్లిపోయింది. మనస్తాపానికి గురైన రాజ్ కుమార్ మంగళవారం సాయంత్రం గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అతని అన్న మగ్గిడి ప్రసాద్ వెంటనే మంచిర్యాల ఆసుపత్రికి తరలించగా, మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే చికిత్స పొందుతూ శనివారం రాత్రి రాజ్ కుమార్ మృతి చెందాడు. మృతుడి తల్లి మగ్గిడి బాలక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

## ఆర్టీవో కార్యాలయంలో వివాదం

- వాహన రిజిస్ట్రేషన్‌కు అనవసర అవాంతరాలు
- సూపరింటెండెంట్ స్వర్ణలత వైఖరిపై తీవ్ర విమర్శలు




**శెనార్తి మీడియా, మంచిర్యాల**

మంచిర్యాల ఆర్టీవో కార్యాలయం మరోసారి వివాదాస్పదంగా మారింది. దండేపల్లి మండలం నాగసముద్రం గ్రామానికి చెందిన కత్తి రాజేందర్ అనే వాహనదారుడు, సెకండ్ హ్యాండ్ మారుతీ వ్యాగన్ఆర్ కారును కొనుగోలు చేసి, రిజిస్ట్రేషన్ కోసం ఆర్టీవో కార్యాలయాన్ని ఆశ్రయించగా, అక్కడ సూపరింటెండెంట్ స్వర్ణలత వ్యవహారశైలి వాహనదారుడికి మింగుడుపడలేదు. రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. అన్ని డిజిటల్ డాక్యుమెంట్లు సమర్పించినా, సూపరింటెండెంట్ స్వర్ణలత అనవసరమైన కారణాలు చూపుతూ రిజిస్ట్రేషన్‌ను నిలుపుదల చేసింది. మరింతగా, మునుపటి యజమానితో వీడియో కాల్ చేయించాల్సిందే అంటూ కొత్త నిబంధనను పెట్టడం రాజేందర్‌ను ఆగ్రహానికి గురిచేసింది. అన్ని పత్రాలు సమర్పించినా వీడియో కాల్ ఎందుకు..? ఇది రిజిస్ట్రేషన్‌ను ఆలస్యం చేయడానికి కొత్త నాటకమా..? అంటూ రాజేందర్ ప్రశ్నించారు. బాధితుడి వాదన ప్రకారం, సరైన పత్రాలు సమర్పించినా, అనవసర ఆంక్షలు విధించడం పట్ల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. అంతేకాకుండా ఆర్టీవో కార్యాలయంలో స్వర్ణలత తనేఒక నిబంధన అంటూ వ్యవహరిస్తుందని, స్థానికులు ఆరోపిస్తున్నారు. కార్యాలయంలో ఆమె మాటే శాసనం, ఎవరి చెప్పిన మాట విన్నట్లు లేదు అంటూ గుసగుసలు వినిపిస్తున్నాయి. మంచిర్యాల ఆర్టీవోలో ఇలాంటి చీకటి కోణాలు ఎప్పుడు మారుతాయో? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

